ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# 'మహాభక్త అన్నమాచార్య' నాటకం - భక్తితత్వం

ఎం. జ్యోతి శివ కాళీ కృష్ణ
పరిశోధక విద్యార్థి,పర్యవేక్షకులు: ఆచార్య ఇ.మాధవి,తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

Article Received: 16/04/2026
Article Accepted: 26/05/2026
Published Online: 28/05/2026
DOI:10.53414/Sahithyatharangini.2025.32124

ఉపోద్ఘాతం:

"కావ్యేషు నాటకం రమ్యం" అని ప్రసిద్ధి. నాటకం బహుళ ప్రజాదరణ పొందిన రంగస్థల ప్రక్రియ. అందుకే కాళిదాసు "నాటకం భిన్నరుచేర్జనాః బహుదా ప్యేకం సమారాధానం" అంటాడు. ఈ రంగస్థల ప్రక్రియ కేవలం వినోదప్రదర్శనమే కాకుండా వివిధ సంస్కృతుల్ని, జాతుల్ని, మనుషుల్ని ఒకటిగా కలిపేదై ఉంటుంది. కొన్నింట స్ఫూర్తినిస్తుంది, కొన్నింట ఆలోచింపచేస్తుంది. కొన్నింట దుఃఖంలో ముంచెత్తుతుంది. కొన్నింట భగవద్భక్తిని ప్రకటిస్తుంది. ఇలా మహాభక్తుడైన అన్నమాచార్యుని జీవిత విశేషాలను, భక్తితత్వాన్ని తెలియచేస్తూ రచించబడిందే "మహాభక్త అన్నమాచార్య " నాటకం. ఈ నాటకాన్ని తాళ్లపాక వాసైన గూడూరు చిన్న పెంచల్ రాజు రచించారు. వీరు వృత్తిరీత్యా సెకండరి గ్రేడు ఉపాధ్యాయులు,ప్రవృత్తి రీత్యా మంచికవి. ఇతని రచనలలో ఈ మహాభక్త అన్నమాచార్య నాటకం, కందరామాయణం, చెక్క భజన కీర్తనలు ప్రసిద్ధి చెందాయి. అయితే, ఈ నాటకంలోని భక్తితత్వాన్ని అంచనా వేసేముందు అసలు ' భక్తి' అంటే ఏమిటో తెలుసుకోవడం అవసరం.

నారదమహర్షి భక్తిని నిర్వచిస్తూ "సాత్వస్మి పరమప్రేమ రూపా", "అమృత స్వరూపవాచ" (1)అని సూత్రీకరించారు. భగవంతునిపై ఏర్పరచుకునే అనంతమైన, అవ్యాజమైన, అనిర్వచనీయమైన అనురాగమే భక్తియని, అది సాక్షాత్తు అమృత స్వరూపమని నారదులు పేర్కొన్నారు. శ్రీకృష్ణ భగవానుడు ఉద్ధవుడికి భక్తి విశిష్టతను తెలియచేస్తూ భాగవతంలో"న సాధయతి మాం యోగేన సాంఖ్యం ధర్మ ఉద్ధవ |
న స్వాధ్యాయస్తపస్త్యాగో యథా భక్తిర్మమోర్జితా ॥"
అని ఓ ఉద్ధవా! నన్ను పొందడానికి భక్తికి సమానమైన శక్తి యోగమునందు కాని, సాంఖ్యమునందు గాని, ధర్మమునందు గాని, వేదాధ్యయనమునందు గాని, తపస్సునందు గాని, త్యాగమునందు గాని లేదు. అనగా భక్తినొక్కదానివల్లనే నేను వశీకృతుడను కాగలను'

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

అంటాడు. ఇలా భగవంతునిపై మనస్సును స్థిరపరచి, తద్వారా జీవాత్మను పరమాత్మతో అనుసంధానిస్తుంది కాబట్టి భక్తి 'యోగం'గా పరిణమించి 'భక్తియోగం" గా పిలువబడుతుంది.

నాటకేతివృత్తం:

తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యుడు తన కుమారుడైన తాళ్లపాక చిన్నన్న (తిరువేంగళ నాథుడు) కోరగా, తన తండ్రయిన అన్నమాచార్యుల జీవిత గాథను వివరిస్తాడు. ఇదే ఈ నాటకం. మహా భక్తురాలైన అన్నమాచార్యుల తల్లి లక్కమాంబ సంతానం లేదని విచారించడం, దానికి ఆమె భర్తనారాయణసూరి ఓదార్చి, తన తండ్రికి ఊటుకూరు గ్రామదేవత చింతలమ్మ "నీ తోడ మూడవ తరంలో ఒక మహానీయుడు పుట్టి నీ వంశ కీర్తిని పెంచుతాడ"ని వరమిచ్చిన విధానం తెలియజేయడం, తదుపరి లక్కమాంబ కోరికపై తిరుమల యాత్ర చేసి స్వామివారి ధ్వజస్తంభం వద్ద సాగిలపడి వేడగా, స్వామి స్వప్నదర్శనమిచ్చి తన బిరుదు గజ్జియల ముప్పిటి కఠారినిచ్చి ఆశీర్వదించడం, తర్వాత లక్కమాంబ గర్భం ధరించి పండంటి మగబిడ్డను కనడం, అతనికి అన్నమయ్య అని పేరు పెట్టడం జరుగుతుంది.

జన్మతః అన్నమయ్యకు పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు భక్తిభావం సహజంగా అబ్బి, సదా ఆ శ్రీమహావిష్ణువుని ధ్యానించడం, ఆయన కీర్తనలు ఆలపించడం చేసేవాడు. ఉమ్మడి సంసారం అవడం వల్ల అన్నమయ్య పని చేయాల్సివచ్చేది.

అలా ఒకరోజు మిత్రులతో కలిసి గడ్డి కోయడానికి వెళ్లి, వేలు తెగి బాధపడుతూ వైరాగ్యం చెందడం, తిరుమలకు పయనమై వెళ్లడం, అక్కడ ఘనవిష్ణువు వైష్ణవ దీక్ష ఇవ్వడం, 16వయేట స్వామి దర్శనం పొందడం, తర్వాత తల్లిదండ్రుల బలవంతం వల్ల ఇంటికి వచ్చి తిమ్మక్క, అక్కలమ్మలను వివాహమాడి స్వామి పై సంకీర్తనలు రచించి పాడడం జరుగుతుంది. కొంతకాలానికి తీర్థయాత్రలలో భాగంగా చిన్ననాటి స్నేహితుడు మరియు రాజైన సాళువ నరసింహరాయలను కలవడం, అతడు అన్నమయ్యను బంధించడం, స్వామి మహాత్మ్యం చేత అన్నమయ్య భక్తిని, శక్తిని గుర్తించి విడిచి పెట్టడం, అటు తర్వాత వృద్ధాప్యంతో అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని శరణు వేడి, సాక్షాత్కారాన్ని పొంది స్వామిలో లీనం అవడం ఈ నాటకేతివృత్తం. ఇందులో రచయిత స్వయంగా తాను తాళ్లపాక చిన్నన్న రచించిన "శ్రీ తాళ్లపాక అన్నమాచార్య చరిత్ర "ను ఆధారంగా తీసుకున్నానని చెప్పుకున్నారు.

నాటకంలో భక్తితత్వం:

పోతన మహాశయులు భాగవతంలో సత్యం, శ్రవణం, దాసత్వం, వందనం, అర్చనం, సేవ, ఆత్మలో ఎరుక, సంకీర్తన, చింతన అనే నవవిధ భక్తి మార్గాలను పేర్కొన్నాడు. ఇవేకాక వాత్సల్య భక్తి మధుర భక్తి, వీరభక్తి, వైరభక్తి,పరభక్తి వంటి అనేక రకాల భక్తి మార్గాల గురించి ఎందరో మహానుభావులు ఎన్నో రకాలుగా తెలియజేశారు.

అయితే పూర్వజన్మ వాసనా రూప సంస్కారాన్ని బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకమైన భక్తి భావన ఏర్పడుతుందని, అలాగే ఒక్కొక్కరికి ఒక్కో దేవత పైన

మక్కువ,ప్రేమలు జనిస్తాయని పూజ్యుల వివరణ.ఇలా ఈ "మహాభక్త అన్నమాచార్య" నాటకంలో ఎందరో భక్తుల గురించి, వారి భక్తి భావనల గురించి చిత్రించబడింది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మరొక ముఖ్యమైన విషయం. భక్తులైన వారికి భగవంతునిపై ఎంతటి పరమ ప్రేమ ఉంటుందో, వారి దాసులపైన, భక్తుల పైన కూడా అంతే భక్తిప్రేమ సహజంగా ఉంటాయి.

దీనిలో భాగంగానే ఈ నాటకంలో అన్నమాచార్యులు భగవత్ భక్తులను సైతం భజించారు. స్వయంగా మహా భక్తుడైన అన్నమాచార్యులనే వారి సంతతివారు,సమకాలీకులు, స్నేహితులు గౌరవించి పూజించడం మనం ఇందులో చూడవచ్చు.

సేవా భక్తి :-

ముందు చెప్పుకున్నట్లు ఒక్కొక్కరిది ఒక్కొక్క విధమైన భక్తి కొందరు సేవా మార్గంలో ప్రత్యక్షంగా పరమాత్మకు సేవలు చేస్తూ తరిస్తే, ఇంకొందరు పరోక్షంగా ప్రత్యక్ష సేవకులకు ఆశ్రయాదులు కల్పించడం, దేవాలయాలను, భక్తులకు విశ్రాంతి మందిరాలను, మఠాలను, సత్రాలను, మండపాలను నిర్మించడం, అలాగే దేవాలయ మార్గాలకు మెట్లు, కోనేరులు మొదలైనవి ఏర్పాటుచేయడం, ఆయా మందిరాల్లోని దేవీ దేవతలకు నిత్యకైంకర్యాలు , ఉత్సవాల కోసం అవసరమైన వాటిని సమకూర్చి, అవి నిరాటంకంగా సాగడానికి మడులు, మాన్యాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తూ, పరమాత్మను పూజిస్తూ తమ సేవాభక్తిని చాటుకుంటారు. ఈ కోవలో ఈ నాటకంలో పెద్దతిరుమలాచార్యులు, అతని కుమారుడు చినతిరుమలాచార్యులు కనిపిస్తారు. అలాగే వీరు అన్నమాచార్యుల లాగా సంకీర్తన మార్గంలో సైతం పరమాత్ముని కీర్తిస్తూ తమ భక్తిని ప్రకటించుకుంటారు.

శ్రవణం – అర్చనం :

"వీటితోపాటుగా భగవంతుడు, ఆయన లీలలను, భగవత్ భక్తులైన భాగవతోత్తముల కథలు, గాథలను ఆలకించి తద్వారా భగవద్భక్తిలో రమించే శ్రవణభక్తి మరియు భగవన్మూర్తిని అర్చించి శరణాగతి వేడే అర్చనభక్తులు కూడా ఈ నాటకంలో దర్శనమిస్తాయి. అసలు ఈ నాటకం అంతా శ్రవణ భక్తి పూర్వకంగానే నడుస్తుందని ముందే చెప్పుకున్నాం కదా! అదే విధంగా అన్నమాచార్యుల తల్లి లక్కమాంబ మహా సాధ్వీమణి మరియు భగవంతుని సదా అర్చించి తరించే గొప్ప భక్తురాలు ఈమె పుట్టిల్లు "మడుపూరులోని మాధవమూర్తియనే దేవుడు లక్కమాంబతో మాటలాడునని ప్రతీతి *(2). ఇది ఆమె భక్తి తత్పరతకు నిదర్శనం.

సంకీర్తనం :

వీరంతా ఒక ఎత్తైతే నాటకంలో మన కథానాయకుడు అన్న మాచార్యుడు ఒకెత్తు. సంకీర్తన సంప్రదాయంలో, శ్రీ వైష్ణవ మార్గంలో పరమాత్మను ప్రస్తుతిస్తూ 32,000 సంకీర్తనలు రచించి గాన కైంకర్యంతో శ్రీనివాసుని అర్చించిన మహాపురుషుడు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

అన్నమయ్య. సాళువ నరసింహరాయలు అన్నమాచార్య శృంగార సంకీర్తనలకు ముగ్ధుడై, తనమీద కూడా సంకీర్తనలు వెలయించమని బంధించినప్పుడు సైతం "నరహరిని కీర్తించే తన నాలుక నరుని కీర్తించదు"అని తన జీవితమంతా స్వామి సేవకే అంకితమైన భక్తాగ్రేసరుడు ఈయన. ఈ సంకీర్తన పారిజాతాలను ఈ నాటకంలో రచయిత కథానుగుణంగా, సందర్భానుసారం చాకచక్యంగా చొప్పించి నాటకాన్ని రక్తి కట్టించాడు.

ముగ్ధ భక్తి :

బాల్యంలో అన్నమయ్య తాళ్లపాక గ్రామంలోని చెన్నకేశవ స్వామి తిరునాళ్లకు వెళ్లే సందర్భంలో, తండ్రి నారాయణ సూరి "అన్నమా! స్వామిని పూజించు విధానం నీకు తెలుసా, ఏ విధంగా పూజింతునో చెప్పగలవా?" అని అడిగిన సందర్భంలో అన్నమాచార్యుల్లో తిన్నడు, గొడగూచి వంటి భక్తశిఖామణులలోని ముగ్ధ భక్తి కనిపిస్తుంది. తిన్నడు ఏ విధంగా శ్రీకాళహస్తీశ్వరుని తన వెంట రమ్మని బ్రతిమాలుతూ, వస్తే రకరకాల ఆహార పదార్థాలు,పళ్ళు వంటివి పెడతానని చెప్పినట్టుగా, గొడుగూచి తన నైవేద్యం స్వీకరించమని భగవంతుని దగ్గర మారం చేసినట్టుగా అన్నమయ్య కూడా ముగ్ధ మనోహరంగా, అమాయకంగా లక్కమాంబ చేసిన రకరకాల పిండి వంటలు, మేలిమి ఫలాలు చెన్న కేశవునికి తినిపిస్తానంటూ

"అమ్మబంపెను ఆరగింపన్న బుజ్జి
అన్నమ వరదాళ్ళుండు బుచ్చన్న కేశ!" (3) అంటూ స్వామికినైవేద్యం పెడతానని చెప్తాడు.

పరాభక్తి వ్యాజస్తుతి :-

పుట్టుకతోనే అన్నమయ్యకు స్వామి పై అమితమైన భక్తిస్వామే సర్వస్వం. సదా ఆయన స్మరణమే. స్వామిని కీర్తిస్తూ జోల పాడితేనే నిద్రించేవాడట. ఏడుస్తుంటే స్వామి పాటలు, నామస్మరణ చేస్తేనే ఊరుకునేవాడట. తినడానికి సైతం హరికీర్తన చేయాల్సిందేనట. అన్నమయ్య పెరిగి పెద్దయినకొద్దీ అతనిలో ఆ దేవదేవుని చింతన మరింత బలపడి తద్వారా వైరాగ్య భావం జనించింది. దీనికి గడ్డి కోస్తున్నప్పుడు తెగిన గాయం తోడై, తిరుమల యాత్రకు కారణమై, ఘనవిష్ణువు వద్ద వైష్ణవదీక్ష తీసుకొని స్వామి సాక్షాత్కారం పొందేందుకు కారణమైంది.

ఈ సందర్భంలో అన్నమయ్య ఆర్తితో వేడగా, తాళం వేయబడిన తలుపులు వాటంతట అవే తెరువబడిన సంఘటన అన్నమయ్య భక్తికి, స్వామి భక్త పరాధీనతకు నిదర్శనం. ఈ తిరుమల యాత్ర సమయంలోనే రచయిత కురవనంబి, చిరుతొండనంబిల భక్తిని, స్వామివారు వారిని అనుగ్రహించిన తీరును చక్కగా చిత్రిస్తాడు. అలాగే మోకాళ్ళ పర్వతం ఎక్కలేక అన్నమయ్య సొమ్మసిల్లి అలమేలు మంగమ్మను ప్రార్థించి నిద్రపోగా, ఆ జగదంబ కలలో సాక్షాత్కరించి కడుపు నింపిన ఘట్టం కూడా అన్నమయ్య భక్తి భావానికి తార్కాణం. ఇంత కష్టపడి కొండపై ఆలయం చేరుకున్న తాళం వేసున్న గర్భాలయం యొక్క ద్వారం చూసి, వేదనతో స్వామిని వేడుకుంటూ

"తాళ్లపాక నుండి తమ దర్శనార్థంబు
వచ్చినట్టి నన్ను వలదటంచు
గుడికి తలుపు మూసి కూర్చుండగాలోన
న్యాయమగునె! తలుపు దీయవయ్య" (4)
అని అంటూ రాతిని నాతిగా చేసావే!,
గజేంద్రుని ఆర్తనాదం విని ఆదమరిచి ఒక్కడివే పరిగెత్తి కాపాడావే! పనిగట్టుకొని ప్రహ్లాదుడి మాటను నిలబెట్టడానికి స్తంభంలో పుట్టావే!,
నిండు సభలో ద్రౌపది మానాన్ని వస్త్రాలిచ్చి రక్షించావే!,
దూర్వాసుని శాపానికి బలైపోయిన అంబరీషుని వెంటనే కాపాడావే!,
మరి నన్ను ఎందుకు ఉపేక్షిస్తున్నావని ఒకపక్క స్వామిని వేడుకుంటున్నట్టు ఉంటుంది. మరోపక్క నిలదీస్తున్నట్టు ఉండి నిందాస్తుతిని కలిగి ఉంటుంది. సాధారణంగా ఆర్తి కలిగిన భక్తుడు, పరమాత్మ అనుగ్రహించక ఇంకా ఇంకా ఆలస్యం చేస్తుంటే, ఆ ఆర్తికి అసహనం తోడై, భగవంతుడిని చనువుతో నిందిస్తాడు కూడా. అయితే ఇందులో కూడా భక్తిభావనే ఉంటుందనేది గమనించాల్సిన విషయం. ఇదే నిందాస్తుతి. ఇది భక్తులైన వారికి ఉండే హక్కు. పై సన్నివేశంలో అన్నమాచార్యుల్లో ఈ ఆర్తితో కూడిన ఆర్ద్ర చిత్తము,ఆవేశంతో కూడిన నిందాస్తుతి, నిలదీత మూడు కనిపిస్తాయి.

బాల్యం నుండి జీవిత చరమాంకం వరకు స్వామి సేవలోనే జీవించి, 32,000 సంకీర్తనలు రచించి అఖండ భక్తి ప్రపత్తులతో స్వామిని ఆరాధించిన అన్నమాచార్య వార్థక్యం పొంది, ఫాల్గున బహుళ ద్వాదశినాడు శ్రీ వేంకటేశ్వరుని వేడి, సాక్షాత్కారం పొంది, స్వామిలో లీనమైపోయాడని అన్నమాచార్యుల జీవిత గాథనంతటిని పెద్ద తిరుమలాచార్యుడు చిన్నన్నకు చెప్పి, ఇరువురు కలిసి కోనేటి రాయడిని కీర్తిస్తుండగా నాటక కర్త నాటకాన్ని ముగిస్తాడు.

ముగింపు:

రచయిత అన్నమాచార్యుడి జీవిత చరిత్రను తీసుకుని" మహాభక్త అన్నమాచార్య" నాటకాన్ని ఆద్యంతం రమణీయంగా సాగించాడు. ఇందులోని పద్యాలు పాఠకుడిని తప్పక అలరింప చేస్తాయి. ఉదాహరణకు ప్రయాణ బడలిక వల్ల మోకాళ్ల పర్వతం దగ్గర అలమేలు మంగమ్మను ప్రార్థించి, నిద్రపోయిన అన్నమయ్యకు స్వప్నంలో ఆ తల్లి దర్శనమిచ్చి, తనను నిద్రలేపి, పలకరించి, ఆహారం తినిపించే సందర్భంలోని-
"పసివాడ విచ్చుట పవ్వళించితి వేర
ఆకలయ్యె నటర నీకు బిడ్డ
ఏ తల్లి గనియెనో యే రీతి బెంచెనో
ఒంటిగా నియ్యేడ నుంటి వేర'!
బాలకా! లెమ్మిక పంచభక్ష్యమ్ముల
తెచ్చితయ్య యివిగొ తినుము కొడుక

సాలగ్రామములున్న స్థలమైన యిచ్చట
పాదరక్షలిడిన పాపమన్న
లేచి భుజియించు నాయనా! లేర తండ్రి
ప్రీతి దినిపించు రార,నా చేతి తిండి
తినిన నీ జన్మతరియించు, ఘనత బెంచు
రహిని రక్షించు వేంకటరమణుడెపుడు" (5) అనే పద్యం.ఇందులో జగన్మాత మాతృహృదయం స్పష్టంగా ప్రకటితమవుతుంది. సంభాషణలు చాలా మట్టుకు దీర్ఘంగా ఉన్నా కూడా నాటకం చక్కగా నడిచిపోతుంది. అలాగే ఇందులో రచయిత, నాటకం పేరుకు తగ్గట్టుగా అన్నమాచార్యులను ఒక మహా పురుషునిగా, మహాయోగిగా చూపించే ప్రయత్నం ఏమాత్రం చేయకుండా పరమ భక్తుడుగానే చూపించే ప్రయత్నం చేస్తూ, అడుగడుగునా భక్తితత్వాన్ని ప్రకటిస్తూ సందర్భానుసారంగా మహా భక్తులైన కుచేలుడు, అంబరీషుడు, ప్రహ్లాదుడు, శబరి, కురువనంబి వంటి వారిని తలపింప చేస్తూ, కొందరి విమల చరిత్రను చూచాయిగా గుర్తు చేస్తూ నాటక నామౌచిత్యానికి సార్థకత చేకూర్చి మహాభక్త అన్నమాచార్య కీర్తిని నాటక రూపంలో నలుదెశలా ప్రకటించారనే చెప్పుకోవాలి.

పాద సూచికలు:
శ్రీ మలయాళ స్వాములవారు - శ్రీ నారద భక్తిసూత్రములు. ఏర్పేడు, వ్యాసాశ్రమం. శ్రీ పారాశర్య ముద్రాక్షరశాల ప్రచురణ. రెండవ కూర్పు. 1989. పుట సంఖ్యలు – 20,23.
గూడూరు చిన్న పెంచల్ రాజు, మహాభక్త అన్నమాచార్య నాటకం. రాజంపేట, కడప జిల్లా. శ్రీ గౌరీశంకర్ ప్రింటర్స్ వారి ముద్రణ. 1995. పుటసంఖ్య – 6.
గూడూరు చిన్న పెంచల్ రాజు, మహాభక్త అన్నమాచార్య నాటకం. రాజంపేట, కడప జిల్లా శ్రీ గౌరీశంకర్ ప్రింటర్స్ వారి ముద్రణ. 1995. పుటసంఖ్య – 16.
గూడూరు చిన్న పెంచల్ రాజు, మహాభక్త అన్నమాచార్య నాటకం. రాజంపేట, కడప జిల్లా. శ్రీ గౌరీశంకర్ ప్రింటర్స్ వారి ముద్రణ. 1995, పుటసంఖ్య – 30.
గూడూరు చిన్న పెంచల్ రాజు, మహాభక్త అన్నమాచార్య నాటకం. రాజంపేట, కడప జిల్లా. శ్రీ గౌరీశంకర్ ప్రింటర్స్ వారి ముద్రణ. 1995, పుటసంఖ్య – 25.

ఆధార గ్రంథాలు:

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

1) శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర-డాక్టర్ కేసర్ల వాణి.తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ. రెండవ ముద్రణ.1997.

2) మహాభక్త అన్నమాచార్య నాటకం - గూడూరు చిన్న పెంచల్ రాజురాజంపేట, కడప జిల్లా, శ్రీ గౌరీ శంకర్ ప్రింటర్స్ వారి ముద్రణ. 1995.

3) శ్రీ నారద భక్తిసూత్రములు - శ్రీ మలయాళ స్వాములవారు, ఏర్పేడు, వ్యాసాశ్రమం,శ్రీ పారాశర్య ముద్రాక్షరశాల ప్రచురణ, రెండవ కూర్పు, 1989.